TGTEL/26/A4985

# ఆదాబ్ సైబరాబాద్

ADAAB CYBERABAD

www.adaabcyberabad.com
epaper.adaabcyberabad.com
adaabcyberabad@gmail.com

ఎడిటర్ : బిల్లాల్‌పూర్‌సారా శివ కుమార్ | సంపుటి : 1 | సంచిక : 14 | మంగళవారం, జూలై 28, 2026 | పేజీలు - 4 | వెల: 5/-

EDITOR : BILLALPURSARA SHIVA KUMAR | VOLUME : 1 | ISSUE: 14 | 28-07-2026 (TUESDAY) | PAGES: 4 | RS : 5/-

### కేసీఆర్.. సింగరేణికి తీరని

## ద్రోహం చేశారు



**న్యూఢిల్లీ, జూలై 27:** దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు కంపెనీ సింగరేణి అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి నుంచి కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, ఎన్‌టీపీసీ( కి బొగ్గు సరఫరా అవుతుందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి తీవ్ర నష్ట చేకూర్చిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సింగరేణి మెరుగు పడటం లేదని వ్యాఖ్యానించారు. కేంద్రం 49 శాతం, తెలంగాణ ప్రభుత్వం 51 శాతం వాటాతో సింగరేణి కొనసాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్.. సింగరేణికి తీరని ద్రోహం చేశారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి ఆదాయానికి గత ప్రభుత్వం గండికొట్టిందని ఆరోపించారు. రాజకీయ వేదికలకు సింగరేణిని వాడుకున్నారంటూ బీఆర్ఎస్, కేసీఆర్‌పై కేంద్ర కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

### రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ స్థానం నుంచి

## తొలగించండి

- హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ
- హైడ్రా కమిషనర్ స్థానం నుంచి రంగనాథ్‌ను తప్పించాలని సీఎస్‌కు ఆదేశం
- కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం సరికాదన్న హైకోర్టు
- హైకోర్టుకు క్షమాపణలు చెప్పిన రంగనాథ్



**హైదరాబాద్ :** హైడ్రా కమిషనర్ స్థానం నుంచి రంగనాథ్ ను తప్పించాలని హైకోర్టు ఆదేశించింది. సెక్రటరీ స్థాయి అధికారితో ఆ స్థానాన్ని భర్తీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. లోతుకుంట భూముల వ్యవహారంలో ఈ మేరకు హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. లోతుకుంటలోని సర్వే నెంబర్ 1, 2 లలో ఉన్న 40 ఎకరాల భూములు శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ స్వాధీనంలో ఉన్నాయి. ఈ భూముల్లో హైడ్రా జోక్యం చేసుకొని ఫెన్సింగ్ వేసిందని, కోర్టు ఉత్తర్వులున్నప్పటికీ లెక్కచేయకుండా హైడ్రా వ్యవహరిస్తోందని శాంతాశ్రీరామ్ కంపెనీ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ పై వరుస విచారణలు చేపట్టిన హైకోర్టు వాదనల సందర్భంగానూ పలు కీలక వ్యాఖ్యలు చేసింది. అరెస్ట్ చేయాలని ఆదేశిస్తాం : ఈ నెల 20వ తేదీన శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఎండీ నరసయ్య కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. 40 ఎకరాల భూమి శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకే చెందుతుందని కోర్టు ఉత్తర్వులున్నప్పటికీ హైడ్రా అధికారులు ఫెన్సింగ్ వేశారని కోర్టుకు తెలిపింది. 20వ తేదీ జరిగిన విచారణ సందర్భంగా హైడ్రాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణకు పాల్పడినందుకు రంగనాథ్?ను అరెస్ట్ చేసి కోర్టుకు తీసుకు రావాల్సిందిగా డీజీపీని ఆదేశిస్తామని పేర్కొంది. సాయంత్రం హాజరవుతారని హైడ్రా తరఫు న్యాయవాది కోర్టును కోరడంతో అంగీకరించింది. ఆ మేరకు రంగనాథ్ హాజరయ్యారు.

### వ్యవసాయ రంగంపై

## ఎల్‌నినో ప్రభావం




ఎల్‌నినో ప్రభావంపై రైతుల్లో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. రాష్ట్ర సచివాలయంలో ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం చర్చించారు. ఈ ఏడాది అంతటా ఎల్‌నినో ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని అంచనాలు వస్తున్న నేపథ్యంలో ఇప్పటికే తీసుకున్న చర్యలతో పాటు, రైతుల్లో మరింత అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఉత్పన్నమయ్యే పరిణామాలను రైతులకు వివరించడంతోపాటు ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఏ ప్రాంతాల్లో ఏయే పంట సాగు చేయాలనే దానిపై రైతులకు వివరించాలని ముఖ్యమంత్రి చెప్పారు. పంటల బీమా యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ సేవల విషయంలో కొంత గ్యాప్ ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. ఆలూరు నియోజకవర్గ పర్యటనలో ఉద్యోగుల పనితీరు క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చిన ప్రతిస్పందనను అధికారుల వద్ద సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. విద్యార్థులకు సైకో మెట్రిక్ టెస్టులు : చదువులో టాపర్ అయిన రంపచోడవరం విద్యార్థి శివాని చనిపోవడం చాలా ఆవేదన కలిగించిందన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పరిశీలించేందుకు సైకో మెట్రిక్ టెస్టులను చేయించాలని విద్యా శాఖ ఆదేశించిందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు సీఎంకు వివరించారు. మానసిక పరిస్థితిని అంచనా వేసేందుకు నిపుణుల సేవలు తీసుకోవడంతోపాటు టీచర్లకు కూడా అవసరమైన మేరకు శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రధాని ఏపీ పర్యటనపై సమీక్ష : మరోవైపు భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో సమావేశం నిర్వహించారు.

### హైడ్రా చీఫ్ రంగనాథ్‌కు మద్దతుగా

## రేవంత్ సర్కార్.



**హైదరాబాద్, జులై 27:**
హైడ్రా చీఫ్ ఎ.వి.రంగనాథ్‌ను తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. హైడ్రా చీఫ్ రంగనాథ్‌కు మద్దతుగా ప్రభుత్వం నిలవాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ అంశంలో లీగల్ ఒపీనియన్ తీసుకోవాలని ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీంతో తెలంగాణ ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్‌ను న్యూఢిల్లీ పంపించారు. అలాగే గతంలో కోర్టు ధిక్కారణ పిటిషన్లను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. హైకోర్టు తీర్పు కాపీ అందిన తర్వాత.. సింగిల్ బెంచ్ తీర్పుపై డివిజన్ బెంచ్‌కు వెళ్లాలని యోజనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. లోతుకుంట భూముల కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌పై సోమవారం తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని అభిప్రాయపడింది. ఆయన్ని తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది.

### సీఆర్పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

## జవాన్లకు ప్రధాని మోదీ

### శుభాకాంక్షలు



**ఆదాబ్ సైబరాబాద్, న్యూఢిల్లీ :** కేంద్ర రిజర్వ్ పోలీసు దళం (సీఆర్పీఎఫ్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ సీఆర్పీఎఫ్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అచంచల ధైర్యసాహసాలు, విధి నిర్వహణలో అంకితభావంతో సీఆర్పీఎఫ్ దేశానికి విశిష్ట సేవలు అందిస్తోందని ప్రశంసించారు. అంతర్గత భద్రత పరిరక్షణ నుంచి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవలందించడం వరకు ప్రతి సందర్భంలోనూ సీఆర్పీఎఫ్ జవాన్లు దేశ ప్రయోజనాలనే ముందుంచారని ప్రధాని పేర్కొన్నారు. మావోయిజం నిర్మూలనలో సీఆర్పీఎఫ్ పోషించిన పాత్ర విశేషమని, వారి కృషి వల్ల అనేక ప్రాంతాల్లో శాంతి, అభివృద్ధికి మార్గం సుగమమైందని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో సీఆర్పీఎఫ్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, దేశ సేవలో వారి అంకితభావానికి అభినందనలు తెలిపారు.

### యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై

## మంగళవారమే చర్చ



**న్యూ ఢిల్లీ :** పబ్లిక్ పరీక్షల్లో అక్రమాల నిరోధానికి రూపొందించిన చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై జరిగిన ఆందోళనల్లో విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసినందుకు హోంమంత్రి అమిత్ షా క్షమాపణలు చెప్పాలంటూ విపక్షాలు నినాదాల మధ్య బిల్లును సభ ముందుకు తీసుకొచ్చింది. అయితే విపక్షాల నిరసనలతో ఎలాంటి చర్చ జరగనుండానే ఉభయ సభలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధికార, విపక్ష సభ్యులతో చర్చించి సయోధ్య కుదిర్చారు. దీనితో మంగళవారం లోక్‌సభలో ఈ బిల్లుపై చర్చ జరిగే అవకాశం కనిపిస్తోంది. పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలను లీక్ చేసే వారిని కఠినంగా శిక్షించడమే లక్ష్యంగా కేంద్రం పరీక్షల్లో అక్రమాల నిరోధక చట్ట సవరణ బిల్లును లోక్ సభలో ప్రవేశపెట్టింది. విపక్ష సభ్యుల ఆందోళన మధ్య కేంద్రమంత్రి జితేంద్రసింగ్ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. పేపర్ లీకేజీలు, పరీక్షల అక్రమాలపై ఉక్కుపాదం మోపేలా చట్టంలో కీలక సవరణలు ప్రతిపాదించినట్లు తెలిపారు. అయితే విపక్షాలు నిరసన కొనసాగించడం వల్ల చర్చ సాధ్యపడలేదు. ఈ క్రమంలో సభ మొదట 12 గంటలకు తర్వాత 2గంటలకు వాయిదా పడింది. తిరిగి సమావేశమైన తర్వాత కూడా విపక్షాలు ఆందోళన కొనసాగించగా స్పీకర్ అధికార, విపక్ష సభ్యులకు 3 గంటలు సమయం ఇచ్చారు. విభేదాలు పరిష్కరించుకోవాలని కోరుతూ సభను సాయంత్రం ఐదు గంటలకు వాయిదా వేశారు. బిల్లును సభలో ప్రవేశపెట్టి చర్చించేందుకు సభ్యులు సహకరించాలని రాజ్యసభ ఉపాధ్యక్షుడుహరివంశ్ సింగ్ కోరినప్పటికీ విపక్ష సభ్యులు ఆందోళన కొనసాగించారు. ఈ క్రమంలో సభ సాయంత్రం 5గంటల 15 నిమిషాలకు వాయిదా పడింది. తిరిగి సమావేశమైన తర్వాతచర్చకు సహకరించాలని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు విపక్షాలను మరోసారి కోరారు.

## గ్లోబల్ పాస్‌పోర్ట్ ఇండెక్స్ నంబర్1




**న్యూ ఢిల్లీ :** ప్రపంచవ్యాప్తంగా పాస్‌పోర్ట్‌ల బలాన్ని అంచనా వేసేటువంటి గ్లోబల్ పాస్‌పోర్ట్ ఇండెక్స్ 2026 జాబితా విడుదలైంది. ఈ ఏడాది ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్ట్‌గా స్వీడన్ నిలవగా, భారత్ మాత్రం ఒక స్థానం కోల్పోయి 125వ ర్యాంకుకు చేరింది. గతేడాది భారత్ 124వ స్థానంలో ఉండేది. గ్లోబల్ సిటిజన్ సొల్యూషన్స్ విడుదల చేసిన ఈ నివేదికలో మొత్తం 197 దేశాలు, భూభాగాల పాస్‌పోర్ట్‌లను విశ్లేషించారు. ప్రయాణ స్వేచ్ఛ, పెట్టుబడి అవకాశాలు, జీవన నాణ్యత అనే 3 ప్రధాన విభాగాల కింద మొత్తం 14 సూచికల ఆధారంగా ర్యాంకింగ్స్ రూపొందించారు. 2026 ఇండెక్స్‌లో 96.05 పాయింట్లతో స్వీడన్ అగ్రస్థానంలో నిలిచింది.

### విద్యార్థుల పట్ల మోదీ సర్కార్ అత్యంత క్రూరంగా

## ప్రవర్తిస్తోంది"



**న్యూ ఢిల్లీ :** విద్యార్థి లోకం పట్ల మోదీ సర్కార్ అత్యంత క్రూరంగా ప్రవర్తిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సోమవారం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వివిధ రాష్ట్రాల్లో విద్యార్థుల గొంతు నొక్కడానికి ప్రభుత్వం ఏకే-47, పెల్లెట్ గన్స్‌లతో సహా పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలను ఉపయోగిస్తోందని ఎక్స్ వేదికగా ఆరోపించారు. "మొత్తం వ్యవస్థ విద్యార్థులకు వ్యతిరేకంగా అత్యంత కూరంగా వ్యవహరిస్తోంది. బిహార్?లో నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై ఏకే-47 బుల్లెట్లతో కాల్పులు జరిగాయని, వందలాది విద్యార్థులను అరెస్టు చేసి వారిపై ఎఫ్ఆర్‌లు నమోదు చేశారని వార్తలు వస్తున్నాయి. దిల్లీలో విద్యార్థులపై పెల్లెట్ గన్స్‌తో కాల్పులు జరిపారు. ఉత్తరప్రదేశ్, బంగాల్, బిహార్, దిల్లీ- ఎక్కడైనా సరే ఇదే పద్ధతి కొనసాగుతోంది. మిస్టర్? మోదీ, విద్యార్థులపై ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయమని, వారిని విడుదల ఏమైంది? దానికి బదులుగా విద్యార్థులపై ప్రాణాంతక దాడులు చేస్తున్నారు. క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. నేను ఇంతకు ముందే చెప్పాను, ఈ ప్రభుత్వానికి నిజాయితీ లేదని. నిజమైన సంస్కరణలు చేయడం వీరి వల్ల కాదు. వారు తమ మాటల నుంచి వెనక్కి తగ్గుతారు. విద్యార్థుల గొంతును నొక్కడానికి అన్ని రకాల ట్రిక్కులను ఉపయోగిస్తారు. మిస్టర్ మోదీ, దేశంలోని విద్యార్థులు అందరికీ క్షమాపణ చెప్పండి. విద్యార్థులపై కాదు, వారిపై దాడి అణచివేసిన వారిపై చర్యలు తీసుకోండి. "

# కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌కు మరో పతకం

## వెయిట్‌లిఫ్టర్ రాజా ముత్తుపాండికి రజతం



**ఆదాబ్ సైబరాబాద్, న్యూ ఢిల్లీ :** గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో భారత వెయిట్‌లిఫ్టర్ రాజా ముత్తుపాండి పురుషుల 65 కిలోల విభాగంలో రజత పతకం సాధించి దేశానికి మరో పతకాన్ని అందించారు. ఈ విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేస్తూ రాజా ముత్తుపాండికి అభినందనలు తెలిపారు. ఈ విజయంతో ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ తన అధికారిక ఎక్స్ (ఎక్స్) ఖాతాలో స్పందిస్తూ, "వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్‌కు మరో పతకం. గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో పురుషుల 65 కిలోల విభాగంలో రజత పతకం గెలుచుకున్న రాజా ముత్తుపాండికి అభినందనలు. ఆయన విజయం ప్రతి భారతీయుడికి గర్వకారణం. భవిష్యత్ పోటీల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను" అని పేర్కొన్నారు.

## బడా బాబుల జోలికి

# వెళ్లని హైడ్రా

**హైదరాబాద్, జులై 27:** రాష్ట్రంలో హైడ్రాను నిషేధిస్తే పేదల ఇళ్లు సురక్షితంగా ఉంటాయని తెలంగాణ బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు అన్నారు. హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌ను తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై సోమవారం ఆయన స్పందించారు. ఈ తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టులాంటిదని అభివర్ణించారు. రంగనాథ్‌ను బలిపశువు చేశారని చెప్పారు. రేవంత్, ఎంఐఎం కనుసన్నల్లో హైడ్రా నడిచిందని విమర్శించారు. ఫాతిమా కాలేజీ, బడాబాబుల జోలికి హైడ్రా వెళ్లలేదని గుర్తు చేశారు. తొలి నుంచి పేదల ఇళ్లే హైడ్రా టార్గెట్ చేసిందని మండిపడ్డారు. హైడ్రాను రద్దు చేయాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సర్కార్‌ను టీబీజేపీ చీఫ్ రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. లోతుకుంట భూముల కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌పై సోమవారం తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. సెక్రటరీ ర్యాంక్ స్థాయిలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమి షనర్‌గా నియమించాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొన సాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని అబి ప్రాయపడింది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్ప డుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొన సాగించడం సరికాదని తేల్చి చెప్పింది. ఆయన్ని తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని తెలం గాణ హైకోర్టు పేర్కొంది. కోర్టు ఆదేశాలను ప్రతిపక్షాలు , బీజేపీలు స్వాగతించాయి.

# మల్కాజ్‌గిరి సీఐగా విజయ్ కుమార్ బాధ్యతల స్వీకారం

**ఆదాబ్ సైబరాబాద్, మల్కాజ్‌గిరి:** మల్కాజ్‌గిరి పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా విజయ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు మల్కాజ్‌గిరి సీఐగా పనిచేసిన సత్యనారా యణను ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యూ)కు బదిలీ చేయగా, ఉప్పల్ సీసీఎస్ నుంచి విజయ్ కుమార్‌ను మల్కాజ్‌గిరికి నియమించారు. ఈ సందర్భంగా సీఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ, మల్కాజ్‌గిరి పరిధిలో శాంతిభద్ర దతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని, ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ అందిస్తూ వారి సహకారంతో మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రజలు ఎలాంటి సమస్యలైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.




## తెలంగాణకు జలసిరి కార్యక్రమంపై గ్రామసభలు నిర్వహించిన ఎంపీడీవో జల సిరి పై ప్రతిజ్ఞ

**ఆదాబ్ సైబరాబాద్, శంకర్ పల్లి :-** శంకర్‌పల్లి మండలంలోని కొండకల్, మోకిల గ్రామపంచాయతీలలో తెలంగాణకు జలసిరి కార్యక్ర మంలో భాగంగా సోమవారం గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన జరిగిన సమావేశాలకు శంకర్‌పల్లి ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వ జలసిరి కార్యక్రమం లక్ష్యాలు, నీటి సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఒక మ్యాజిక్ సోక్ పిట్, ప్రతి వ్యవసాయ క్షేత్రానికి ఒక ఫామ్ పాండ్ నిర్మించుకోవాలని సూచించారు. అలాగే ప్రతి గ్రామంలో ఒక పర్‌కొలేషన్ ట్యాంక్ ఏర్పాటు చేసి వర్షపు నీరు వృథా కాకుండా ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఎల్ నినో ప్రభావంతో ఏర్పడుతున్న వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని, వరి సాగుకు అధిక ప్రాధాన్యం ఇవ్వకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం జల సిరి పై ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, రైతులు పాల్గొన్నారు.



# ప్రజావాణిలో 27 ఫిర్యాదులు

**ఆదాబ్ సైబరాబాద్, మల్కాజిగిరి:** మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో సోమవారం జోనల్ కమిషనర్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 27 ప్రజా ఫిర్యాదులు అందాయి. ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించిన జోనల్ కమిషనర్, వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, డిప్యూటీ డైరెక్టర్ (యూబీడీ) బి. శ్రీధర్ రావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వి.బి. శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



# ఏపీలో ఎఫ్‌సీవీ పొగాకు మార్కెట్‌పై కేంద్ర వాణిజ్య శాఖ సమీక్ష..

**– రైతుల ప్రయోజనాల పరిరక్షణకు చర్యలు**

**ఆదాబ్ సైబరాబాద్, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో ఫ్లూ-క్యూర్డ్ వర్జీనియా (ఎఫ్‌సీవీ) పొగాకు మార్కెట్ పరిస్థితులపై కేంద్ర వాణిజ్య శాఖ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం సమీక్ష నిర్వహించింది. అదనపు కార్యదర్శి నితిన్ కుమార్ యాదవ్ నేతృత్వంలోని బృందం జూలై 25న రాష్ట్రాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొని, పొగాకు బోర్డు ఛైర్మన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తో కలిసి ఎఫ్‌సీవీ పొగాకు రైతుల ప్రయోజనాల పరిరక్షణ, రంగంలో దీర్ఘకాలిక స్థిరత్వానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రతినిధి బృందం వెల్లంపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రాన్ని సందర్శించి, వేలం ప్రక్రియను పరిశీలించింది. అలాగే రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి మార్కెట్ పరిస్థితులపై అభిప్రాయాలు సేకరించింది. పారదర్శకంగా, క్రమబద్ధంగా వేలాలు నిర్వహిస్తున్న పొగాకు బోర్డును అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా నితిన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ, ఎఫ్‌సీవీ పొగాకు మార్కెట్ పరిస్థితులను కేంద్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పొగాకు బోర్డు, ఇతర భాగస్వామ్య సంస్థలతో సమన్వయం చేస్తూ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.







# దోమలను అరికడదాం సీజనల్ వ్యాధులను నివారిద్దాం

**– జె. శ్రీనివాసులు హెల్త్ ఎడ్యుకేటర్**

**ఆదాబ్ సైబరాబాద్ షాద్ నగర్ జులై27:** చించోడు గ్రామ పంచాయితీలో, చించోడు గ్రామ సర్పంచ్ రాకాల శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రామ సభకు ముఖ్య అతిథిగా ఫరక్ నగర్ మండల్ ఎంపీడీవో శ్రీకాంత్ గారు హాజరయ్యారు. ఈ గ్రామ సభలో హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల గురించి గ్రామ ప్రజలకు తెలియజేశారు. వర్షాకాలంలో వాతావరణంలో తేమ పెరగడం వలన, నీరు నిల్వ ఉండడం వలన, దోమలు మరియు ఈగలు ఎక్కువగా పెరుగుతాయని, వీటి వలన అనేక సీజనల్ వ్యాధులు వ్యాపిస్తాయని, ఇలాంటి సమయంలో గ్రామ ప్రజలు పరిశుభ్రత పాటించకపోతే, వివిధ రకాల వ్యాధులు త్వరగా ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అవకాశం ఉంటుందని జె. శ్రీనివాసులు చెప్పారు. దోమలలో అనాపిలిస్ దోమ, క్యూలెక్స్ దోమ మరియు ఏడీస్ దోమ వంటి దోమల వలన మలేరియా వ్యాధి, ఫైలేరియా వ్యాధి, డెంగు వ్యాధి మరియు చికెన్ గునియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అన్నా ఫ్లీజ్ దోమ కొట్టడం వలన మలేరియా జ్వరం వస్తుంది అని, ఈ జ్వరం చలి వణుకుతో కూడి ఉంటుందని, తలనొప్పి, చెమటలు పట్టడం, అలసట ఒంటి లక్షణాలు కనిపిస్తాయని చెప్పారు. క్యూలెక్స్ దోమ కుట్టడం వల్ల బోదకాల వ్యాధి వస్తుందని, ఈ వ్యాధి లక్షణాలు తరచుగా జ్వరం రావడం, శోష రస గ్రంధులు వాపు రావడం, చేతులు లేదా కాళ్ళ మీద వాపు రావడం, పురుషులలో వృషణ సంచి వాపు రావడం , చర్మం మందంగా, గరుకుగా మారడం , వ్యాధి తీవ్రమైన స్థితిలో ఏనుగుకాలుగా మారుతుందని చెప్పారు. లేడీస్ దోమ కుట్టడం వలన డెంగు జ్వరం వస్తుందని, డెంగు లక్షణాలు అధిక జ్వరము తీవ్రమైన తలనొప్పి కల్ల వెనుక నొప్పి కండరాలు కీళ్ల నొప్పులు చర్మంపై ఎర్రటి దద్దుర్లు రావడం, ప్లేట్ లేట్స్ తగ్గిపోవడం జరుగుతుందని జె.శ్రీనివాసులు తెలియజేశారు. పైన తెలిపిన వ్యాధులకు వివిధ లక్షణాలు కనబడిన వెంటనే దగ్గర్లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్ష చేయించుకుని వ్యాధి వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే వైద్యుని సలహాతో తగిన చికిత్స తీసుకోవాలని తెలియజేశారు. వర్షాకాలంలో ఈగల వలన నీరు మరియు ఆహారము కలుషితం అయినప్పుడు, కలుషితమైన ఆహారం నీరు త్రాగడం వలన మనిషికి తరచూ విరేచనాలు, వాంతులు, నీరసము, డిహైడ్రేషన్ ఏర్పడుతాయని చెప్పారు. ఇలాంటప్పుడు ఆ వ్యక్తికి ఓఆర్ఎస్ ద్రావణం ఇవ్వాలని, సురక్షితమైన నీరు మాత్రమే తాగించాలని , వైద్యుని సలహాతో తగిన చికిత్స తీసుకోవాలని తెలియజేశారు. వర్షాకాలంలో పాటించవలసిన జాగ్రత్తలు ఏంటి అనగా. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండనివ్వకండి, తాగు నీతిని మరిగించి లేదా శుద్ధి చేసి తాగవలనని, తాజా , వేడి ఆహారమే తీసుకోవాలని, భోజనము ముందు మరియు మరుగుదొడ్డి తర్వాత చేతులను సబ్బుతో కడుక్కోవాలని, దోమతెరలు దోమ నివారణ చర్యలు పాటించాలని, జ్వరము రెండు రోజుల కంటే ఎక్కువ ఉంటే లేదా తీవ్రమైన లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని హెల్త్ ఎడ్యుకేటెడ్ జె.శ్రీనివాసులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫరూక్నగర్ ఎంపీడీవో శ్రీకాంత్ , గ్రామ సర్పంచ్ రాకాల శ్రీనివాస్, డిప్యూటీ సర్పంచ్ కే రాజేందర్ రెడ్డి, విలేజ్ సెక్రటరీ జయపాల్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, డి.పి.ఎమ్.ఓ వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్లు ఉమామహేశ్వర నాయక్, సంతోష్ నాయక్, యాదగిరి , రామచంద్రయ్య, ఆశాలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



# 2030 నాటికి హెపటైటిస్ నిర్మూలన లక్ష్యంగా భారత్..

**– ఉచిత పరీక్షలు, చికిత్సతో కేంద్రం ముందడుగు**

**ఆదాబ్ సైబరాబాద్, న్యూఢిల్లీ :** 2030 నాటికి హెపటైటిస్ వ్యాధిని సమర్థంగా నియంత్రించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ వైరల్ హెపటైటిస్ నియంత్రణ కార్యక్రమంను విస్తృతంగా అమలు చేస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా హెపటైటిస్ బీ, సీ బాధితులకు దేశవ్యాప్తంగా ఉచిత పరీక్షలు, మందులు, చికిత్స అందుబాటులో ఉంచుతోంది. హెపటైటిస్ అనేది కాలేయానికి సంబంధించిన వైరల్ వ్యాధి. హెపటైటిస్--బీ, హెపటైటిస్--సీ వైరస్‌లు దీర్ఘకాలిక కాలేయ వ్యాధులు, సిరోసిస్, కాలేయ క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదం ఉందని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. 2018లో ప్రారంభించిన జాతీయ వైరల్ హెపటైటిస్ నియంత్రణ కార్యక్రమం కింద అవగాహన, నిర్ధారణ, చికిత్స, నివారణ చర్యలను సమగ్రంగా అమలు చేస్తున్నారు. హెపటైటిస్--బీ నివారణకు యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా నవజాత శిశువులకు టీకాలు అందిస్తున్నారు. హెపటైటిస్--సీకి వ్యాక్సిన్ లేకపోయినా, ఆధునిక యాంటీవైరల్ మందులతో 12 నుంచి 24 వారాల్లో దాదాపు పూర్తిస్థాయిలో నయం చేయవచ్చని అధికారులు తెలిపారు. గర్భిణీలకు హెపటైటిస్--బీ స్క్రీనింగ్, అధిక ప్రమాద వర్గాలకు పరీక్షలు, రక్తదాన కేంద్రాల ద్వారా గుర్తించిన బాధితులను చికిత్సకు అనుసంధానం చేయడం వంటి చర్యలు కూడా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం జిల్లా ఆసుపత్రుల నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వరకు సేవలను విస్తరిస్తూ, ప్రతి పౌరుడికి పరీక్షలు, చికిత్స సులభంగా అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. హెపటైటిస్‌పై సమాచారం కోసం 1800-11-6666 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌ను కూడా అందుబాటులో ఉంచింది.




# ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌పై ప్రైవేటు పెత్తనం?

**– వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు**
**– ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనాన్ని అక్రమంగా అద్దెకు ఇస్తున్నారన్న ఆరోపణలు..**
**– ఆరేళ్ల ఆదాయంపై విచారణకు డిమాండ్**

**ఆదాబ్ సైబరాబాద్, కుత్బుల్లాపూర్ :** దుండిగల్ సర్కిల్ పరిధిలోని శంభిపూర్ గ్రామం సర్వే నంబర్--181లో ప్రభుత్వ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని కోరుతూ స్థానిక గ్రామస్థులు దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రకారం, గ్రామ పంచాయతీ హయాంలో ప్రజల ప్రయోజనం కోసం నిర్మించిన కమ్యూనిటీ హాల్, దుండిగల్ మున్సిపాలిటీ ఏర్పాటై అనంతరం జీహెచ్ఎంసీలో విలీనమైనప్పటికీ ఇప్పటికీ అధికారికంగా జీహెచ్ఎంసీ ఆధీనంలోకి రాలేదని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు ప్రైవేటు వ్యక్తులు కమ్యూనిటీ హాల్‌ను తమ సొంత ఆస్తిలా నిర్వహిస్తూ, వివాహాలు, సామాజిక కార్యక్రమాలు, ఇతర వేడుకలకు అద్దెకు ఇచ్చి ప్రజల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారం ప్రభుత్వ ఆస్తిని వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించడం మాత్రమే కాకుండా ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కమ్యూనిటీ హాల్‌ను ఇప్పటివరకు జీహెచ్ఎంసీ ఎందుకు స్వాధీనం చేసుకోలేదనే అంశంపై కూడా సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యం వహించిన అధికారుల బాధ్యతను నిర్ధారించాలని కోరారు.




**ఫిర్యాదులో భాగంగా గ్రామస్థులు పలు డిమాండ్లు చేశారు, వాటిలో ప్రధానంగా:**

- కమ్యూనిటీ హాల్ యాజమాన్యం, నిర్వహణపై తక్షణ విచారణ చేపట్టడం.
- భవనాన్ని వెంటనే జీహెచ్ఎంసీ ఆధీనంలోకి తీసుకోవడం.

అక్రమంగా అద్దెలు వసూలు చేశారా లేదా అనే అంశాన్ని పరిశీలించడం.

- గత ఆరేళ్ల ఆదాయంపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించి, అక్రమంగా వసూలైన మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయించడం.
- బాధ్యులపై జీహెచ్ఎంసీ చట్టం--1955తో పాటు ఇతర వర్తించే చట్టాల ప్రకారం సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవడం.

ప్రభుత్వ నిధులతో నిర్మించిన ప్రజా ఆస్తులు ప్రజల ప్రయోజనాలకే వినియోగించబడేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ఈ ఫిర్యాదులో జీహెచ్ఎంసీ చట్టంలోని అనధికార ఆక్రమణల తొలగింపు, ప్రజా ఆస్తుల పరిరక్షణకు సంబంధించిన నిబంధనలను కూడా ప్రస్తావించారు.

# వెలిజెర్ల రైతు వేదికలో ఘనంగా విత్తన మేళా

**– ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపుల్ సెక్రటరీ సురేంద్రమోహన్(ఐఏఎస్)**

**ఆదాబ్ సైబరాబాద్ షాద్ నగర్, జులై27:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వెలిజెర్ల రైతు వేదికలో నిర్వహించిన విత్తనమేల కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ సురేంద్రమోహన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతు వేదికలో ఏర్పాటు చేసినటువంటి వివిధ రకాల విత్తనాల స్టాల్స్ ను పరిశీలించి, వ్యవసాయ అధికారులతో మరియు రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా రైతులు ఎక్కువ నీరు అవసరమైనటువంటి వరి పంటలను తగ్గించుకొని అందులో ఆరుతడి పంటలు గా కందులు, పెసర్లు, మినిములు, సజ్జలు లాంటివి వేసుకోవాలని సూచించారు. అదేవిధంగా రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహా సూచనలు పాటించి, తగిన పంటలు వేసుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు కంది, పెసర, మినుము, కూరగాయలు వంటి తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని, నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం కోల్డ్ స్టోరేజ్ మరియు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రోత్సాహం అందిస్తోందని, ఇంకుడు గుంతల్లో వంటి నీటి సంరక్షణ పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు. అలాగే ఎల్‌నినోపై రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రైతులు ఫారంపౌండ్ కొరకు ప్రభుత్వ ఉచిత సబ్సిడీని వినియోగించుకోవాలని సూచించారు.. అనంతరం కంది మొక్కజొన్న అంతర పంట సాగు చేస్తున్న రైతు పొలాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి పంట పరిస్థితిని పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, మార్కెట్ డైరెక్టర్లు వెంకటరెడ్డి, భరత్, సురేష్, వెలిజెర్ల సర్పంచ్ బాబు నాయక్, కొండన్నగూడ సర్పంచ్ అనురాధ సురేష్ గౌడ్, వివిధ గ్రామాల ఉపసర్పంచులు, రైతులు, జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, ఏ డి ఏ టెక్నికల్ రమాదేవి, షాద్నగర్ ఏడిఏ రమాదేవి, మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్, ఉద్యానవన అధికారి హిమబిందు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.



# ఉస్మానియా యూనివర్సిటీ పరీక్షల నోటిఫికేషన్ విడుదల

**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి బీఎస్--ఎంఎస్ (కంప్యూటర్ సైన్స్) ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌కు సంబంధించిన పరీక్షల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. విశ్వ విశ్వాని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిస్టమ్స్ అండ్ మేనేజ్‌మెంట్, హైదరాబాద్ మరియు ట్రెండ్జ్ డిగ్రీ కాలేజీలో చదువుతున్న విద్యార్థులకు ఈ నోటిఫికేషన్ వర్తిస్తుంది. సెమిస్టర్ల రెగ్యులర్, బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్ మెంట్ పరీక్షలు, ఠ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు, అలాగే సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు 2026 ఆగస్టు--సెప్టెంబర్ నెలల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పరీక్షల పూర్తి టైమ్‌టేబుల్‌ను త్వరలో విడుదల చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష ఫీజు, పరీక్ష దరఖాస్తులను ఆలస్య రుసుము లేకుండా జూలై 24లోగా, రూ.300 ఆలస్య రుసుముతో జూలై 29లోగా తమ కళాశాలల్లో సమర్పించాలి. కళాశాలలు పరీక్ష ఫీజును ఆన్‌లైన్ ద్వారా జూలై 25లోగా, ఆలస్య


CONTROLLER OF EXAMINATIONS
OSMANIA UNIVERSITY
HYDERABAD - 500007
(Re-Accredited by NAAC with 'A+' Grade)

No.1707/PG/Exams/2026 Date : 17.07.2026

NOTIFICATION

1. It is hereby notified for information of all the REGULAR CANDIDATES of BS - MS (Computer Science – Five Year Integrated Dual Degree Program) that the II, IV, VI & VIII-Semesters (Regular, Backlog & Improvement), X-Semester (Regular) and I, III, V, VII & IX-SemesterS (Backlog & Improvement) offered at Vishwa Vishwani Institute of Systems & Management, Hyderabad and Trendz Degree College Examinations are scheduled in the month of Aug/Sep, 2026. The detailed Time-Table will be notified in due course.
2. The payment of examination fee and submission of Examination Application Forms (EAF) is as follows :-

| Description | Last dates: Without Late Fee | With late fee of Rs.300/- |
|---|---|---|
| For Students: Payment of Examination fee and submission of EAF at their respective colleges | 24.07.2026 | 29.07.2026 |
| For Colleges: 1. Remittance of consolidated Examination fee should pay through online only 2. Submission of EAF Online | 25.07.2026 | 30.07.2026 |
| 3. Submission of Hard copy of EAF | 31.07.2026 | |

SPECIAL INSTRUCTIONS TO THE PRINCIPALS :-

The college login will be closed on the last date i.e. 31.07.2026 at 5:00 p.m.

i) The late fee amount will be levied automatically in case the fee is not Remitted to the O.U. A/c. And forms are not submitted as per the above schedule.
ii) The Principals are requested to forward EAF along with Annexure-I otherwise, EAF will not be accepted.
iii) Principals are requested not to forward/submit the EAF of Not Eligible Candidates. The results of Not Eligible candidates will be cancelled at any stage, if they write the examination.
iv) THE I & II CONSOLIDATED INTERNAL ASSESSMENT, PRACTICAL AND SEMINAR MARKS WILL BE ACCEPTED THROUGH ONLINE ONLY. HENCE, ALL THE PRINCIPALS ARE REQUESTED TO SUBMIT THROUGH ONLINE ONLY ALONG WITH ONE HARD COPY FOR VERIFICATION.

P.T.O.

రుసుముతో జూలై 30లోగా చెల్లించాల్సి ఉండగా, ఈఏఎఫ్లను ఆన్‌లైన్‌లో జూలై 30లోగా, హార్డ్ కాపీలను జూలై 31 సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాలి. అన్ని పేపర్లకు పరీక్ష ఫీజు రూ.2,760, మూడు పేపర్ల వరకు రూ.1,431గా నిర్ణయించారు. చెల్లించిన పరీక్ష ఫీజు తిరిగి ఇవ్వబడదని, భవిష్యత్ పరీక్షలకు సర్దుబాటు చేయబడదని స్పష్టం చేశారు. 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న అంధులు, శారీరక వికలాంగులు, చెవిటి, మూగ విద్యార్థులకు పరీక్ష ఫీజు, ప్రాసెసింగ్ ఫీజు నుంచి మినహాయింపు ఉంటుందని, ఇందుకు వైద్య ధ్రువీకరణ పత్రాన్ని జతచేయాలని సూచించారు. విద్యార్థుల వివరాలు లేదా సబ్జెక్టుల నమోదులో పొరపాట్లు జరిగితే ఒక్కో తప్పిదానికి రూ.1,000 జరిమానా విధించనున్నట్లు, అనర్హులైన విద్యార్థుల దరఖాస్తులు పంపరాదని, వారు పరీక్షలు రాసినా ఏ దశలోనైనా ఫలితాలు రద్దు చేయబడతాయని యూనివర్సిటీ హెచ్చరించింది.

# వట్టే జానయ్యపై పీడీ యాక్ట్

**- బీసీలను అణచివేసే కుట్ర: టీఆర్పీ**

**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్:** తెలంగాణ రాజ్యాధికార పార్టీ సీనియర్ నాయకుడు వట్టే జానయ్యపై అక్రమంగా పీడీ యాక్ట్ నమోదు చేయడం బీసీల రాజకీయ ఎదుగుదలను అడ్డుకునే కుట్రలో భాగమేనని టీఆర్పీ నాయకులు ఆరోపించారు. సూర్యాపేట జిల్లాలో వట్టే జానయ్యకు పెరుగుతున్న రాజకీయ ఆదరణ, ప్రజల్లో లభిస్తున్న గుర్తింపును చూసి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లోని ఆధిపత్య వర్గాల నాయకులు ఓర్వలేక కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని విమర్శించారు. రెడ్లు, వెలమల ఆధిపత్యంలో కొనసాగుతున్న పార్టీల్లో బీసీలకు తగిన రాజకీయ ప్రాధాన్యం దక్కడం లేదని, వారు కేవలం రాజకీయ బానిసత్వానికే పరిమితమవుతున్నారని పేర్కొన్నారు.



ఈ పరిస్థితిని మార్చేందుకు బీసీలు ఏకమై తెలంగాణ రాజ్యాధికార పార్టీని ఏర్పాటు చేసుకుని రాజకీయంగా ఎదుగుతున్న తరుణంలో వారిని అణచివేసేందుకు అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. వట్టే జానయ్యకు చెందిన పరిశ్రమలను అన్యాయంగా సీజ్ చేయడమే కాకుండా, ఆయనపై 70కి పైగా తప్పుడు కేసులు నమోదు చేశారని, చివరకు పీడీ యాక్ట్ కూడా ప్రయోగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. బీసీల రాజకీయ ఎదుగుదలను చూసి ఆధిపత్య వర్గాల్లో భయం, అసహనం పెరిగిందని, అందుకే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. భౌతిక కష్టాలను ప్రజలు పరస్పర సహకారంతో అధిగమించగలరని, అయితే ఒక సామాజిక వర్గం ఆత్మగౌరవాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగితే ఆ వర్గం ఎప్పటికీ సహించదని టీఆర్పీ నాయకులు హెచ్చరించారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలు కొనసాగితే ఆధిపత్య రాజకీయాలకు వ్యతిరేకంగా బీసీలు ఐక్యంగా పోరాడతారని స్పష్టం చేశారు.

# పారిశ్రామికాభివృద్ధిపై చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు సమీక్ష

**- ఈ-సిటీ, మంఖాల్, మహేశ్వరం పారిశ్రామిక ప్రాంతాల సందర్శన..**

**- పెట్టుబడులు, ఉపాధి అవకాశాలపై ఆరా**

**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (చీఫ్ సెక్రటరీ) సంజయ్ జాజు సోమవారం ఈ-సిటీ ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్, మంఖాల్ ఇండస్ట్రియల్ పార్క్, మహేశ్వరం జనరల్ పార్క్‌లలోని ప్రధాన పరిశ్రమలను సందర్శించి పారిశ్రామికాభివృద్ధి, తయారీ సామర్థ్యాలు, పెట్టుబడులు, ఉపాధి కల్పనపై సమగ్రంగా సమీక్షించారు.

ఈ పర్యటనలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ అలాగే మేనేజింగ్ డైరెక్టర్, ప్రభుత్వ కార్యదర్శి, టీజీఐపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**- ఈ-సిటీలో రెండు ప్రముఖ సంస్థల సందర్శన**

చీఫ్ సెక్రటరీ ముందుగా ప్రీమియర్ ఎనర్జీస్ ఫోటోవోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను సందర్శించారు. 25 ఎకరాల్లో ఏర్పాటు చేసిన అత్యాధునిక సోలార్ పీవీ మాడ్యూల్స్ తయారీ కేంద్రంలో రూ.1,240 కోట్ల పెట్టుబడి పెట్టగా, సుమారు 1,200 మందికి ఉపాధి కల్పిస్తోంది.



అనంతరం అవాంటెల్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించారు. 4 ఎకరాల్లో విస్తరించిన ఈ సంస్థ రక్షణ రంగానికి అవసరమైన హైటెక్ ఎలక్ట్రానిక్స్, శాటిలైట్ పేలోడ్ సిస్టమ్స్, గ్రౌండ్ స్టేషన్ మౌలిక సదుపాయాల తయారీలో నిమగ్నమై ఉంది. ఈ సంస్థలో రూ.59.22 కోట్ల పెట్టుబడితో 400 మందికి ఉపాధి లభిస్తోంది.

**- మంఖాల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో చిరిపాల్ పాలీ ఫిల్మ్స్**

మంఖాల్ ఇండస్ట్రియల్ పార్క్‌లోని చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ యూనిట్‌ను కూడా చీఫ్ సెక్రటరీ పరిశీలించారు. 29.87 ఎకరాల్లో బీఓపీపీ/బీఓపీఈటీ ఫిల్మ్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసిన ఈ సంస్థ కోటింగ్, మెటలైజింగ్, స్లిట్టింగ్, రీసైక్లింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. రూ.284.02 కోట్ల పెట్టుబడితో వాణిజ్య ఉత్పత్తి కొనసాగిస్తున్న ఈ సంస్థ 500 మందికి ఉపాధి కల్పిస్తోంది.

**- మహేశ్వరంలో విప్రో, మలబార్ జెమ్స్ సందర్శన**

మహేశ్వరం జనరల్ పార్క్‌లోని విప్రో ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ తయారీ కేంద్రాన్ని కూడా సందర్శించారు. 30 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో రూ.174.34 కోట్ల పెట్టుబడితో 331 మందికి ఉపాధి లభిస్తోంది.

అలాగే మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను పరిశీలించారు. 3.7 ఎకరాల్లో ఆధునిక ఆభరణాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఈ సంస్థ రూ.374.05 కోట్ల పెట్టుబడితో 2,782 మందికి ఉపాధి కల్పిస్తూ వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

**- పరిశ్రమలకు ప్రభుత్వ సంపూర్ణ మద్దతు**

పర్యటన సందర్భంగా పరిశ్రమల ప్రతినిధులు, అధికారులతో చర్చించిన చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు, తెలంగాణ తయారీ రంగ బలోపేతం, భారీ పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పనలో ఈ పరిశ్రమల పాత్రను అభినందించారు. రాష్ట్రంలో ప్రపంచ స్థాయి పారిశ్రామిక మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణాన్ని మరింత బలోపేతం చేసి పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

# నేషనల్ హ్యూమన్ రైట్స్ - ఉమెన్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ కౌన్సిల్ వితరణ!

**- మేడారం ఇంగ్లీష్ మీడియం ఆశ్రమ ఉన్నత పాఠశాల**

**ఆదాబ్ సైబరాబాద్,ములుగు జిల్లా ప్రతినిధి:**నేషనల్ హ్యూమన్ రైట్స్ - ఉమెన్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ జాతీయ చైర్మన్ ఆనంతుల శ్రీనివాస్ ఆదేశాల మేరకు ములుగు జిల్లా అధ్యక్షుడు గొంది లక్ష్మణ మూర్తి మరియు సంస్థ సభ్యులు మేడారంలోని ఇంగ్లీష్ మీడియం ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలపై ఆరా తీయడం జరిగింది మేడారం ఎవీ సాయి బాబ అనంతరం హాస్టల్ వార్డెన్ని కవితను కలిసి విద్యార్థుల సౌక



ర్యాలపై ఆరా తీశారు అట్లాగే వారికి ఇచ్చే డైట్ పరిశీలించారు. పాఠశాలలో కుర్చీలు సరిగా లేకపోవడంపై స్పందించి వైష్ణవి గ్రూప్ ఎన్జీవో వారిని సంప్రదించి హ్యూమన్ రైట్స్ ఉమెన్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ కౌన్సిల్ మరియు వైష్ణవి గ్రూప్స్ సంయుక్తంగా ఆశ్రమ పాఠశాలకు పది కుర్చీలు మరియు ఒక టేబుల్ సమకూర్చారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా సంస్థ రాష్ట్ర కార్యదర్శి పాయం జై బాబు, మరియు మేడారం గ్రామ సర్పంచ్ భారతి పీరిల వెంకన్న ,హాజరు కాగా హాస్టల్ వార్డెన్, ఉపాధ్యాయులు, సంస్థ జనరల్ సెక్రటరీ ఎం. కేశవరావు, కొరకట్ల సరళ, అట్టం కృష్ణయ్య, లావణ్య టీచర్ ,వార్డెన్ కవిత ,మొదలగు ఉపాధ్యాయ బృందం మరియు సభ్యులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ జంక్షన్‌లో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం

**- 200 ఐఎస్ఐ హెల్మెట్ల పంపిణీ**

**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ :** హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా జూబ్లీహిల్స్ ట్రాఫిక్ జోన్ ఏసీపీ కె. హరి ప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జంక్షన్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తారక్ ట్రస్ట్ సహకారంతో ద్విచక్ర వాహనదారులు, వెనుక కూర్చునే ప్రయాణికులకు 200 ఐఎస్ఐ ప్రమాణాల హెల్మెట్లను పంపిణీ చేశారు.అలాగే వాహనదారులకు రాంగ్‌సైడ్ డ్రైవింగ్, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ వినియోగం, మైనర్లతో వాహనాలు నడిపించడం వంటి ప్రమాదకర చర్యల వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు.రోడ్డు నిబంధనలు పాటించడం, తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాలను తగ్గించి హైదరాబాద్ రహదారులను మరింత సురక్షితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ట్రాఫిక్ పోలీసులు పిలుపునిచ్చారు.




## అంగవైకల్య బాలుడి కోరిక తీర్చిన పోలీస్ కమిషనర్ రాహుల్‌కు పోలీస్ అధికారిగా మారిన అనుభూతి కల్పించిన బడుగుల సుమతి



**ఆదాబ్ సైబరాబాద్, మల్కాజిగిరి:** మేడ్చల్ జిల్లా కీసర మండలం దమ్మాయిగూడకు చెందిన పుట్టుకతోనే అంగవైకల్యంతో బాధపడుతున్న రాహుల్ కోరికను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బడుగుల సుమతి నెరవేర్చారు. పోలీస్ అధికారి కావాలన్న రాహుల్ ఆకాంక్షను గుర్తించిన ఆమె, కమిషనరేట్ కార్యాలయంలో తన కుర్చీలో కూర్చోబెట్టి పోలీస్ టోపీ ధరింపజేసి అతని కలను సాకారం చేశారు. దీంతో రాహుల్ ఆనందంతో ఉప్పొంగిపోయాడు.రాహుల్‌కు వీల్‌చైర్ అందించిన ప్రతిమ ఫౌండేషన్ చైర్మన్ రష్మిత, తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ సేవలను కమిషనర్ అభినందించారు. అంగవైకల్యం ఉన్న వారి పట్ల ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ తల్లిదండ్రులు, సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## కొత్తపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఆకస్మిక తనిఖీ




**సైబరాబాద్ ఆదాబ్, ఉట్నూర్ :**ఉట్నూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలను గ్రామ సర్పంచ్ ఆర్. నర్సిములు, పంచాయతీ కార్యదర్శి శివ శంకర్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన నాణ్యత, తాగునీటి సౌకర్యం, తరగతి గదుల పరిస్థితి ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన సూచనలు సంబంధిత సిబ్బందికి అందించారు.ఈ కార్యక్రమం లో గ్రామస్తులు నర్సిములు పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి వేడుకలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలి-ఆలయ చైర్మన్ ధాత్రిక సింహం

**(ఆదాబ్ సైబరాబాద్)మేడ్చల్:**మేడ్చల్ పట్టణం స్టేషన్ రోడ్డు లో గల శ్రీ షిర్డీ సాయి సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 29 వ తేదీన గురు పూర్ణిమ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవాలయ చైర్మన్ ధాత్రిక సింహం తెలిపారు.ఈ సందర్భంగా ధాత్రిక సింహం మాట్లాడుతూ ఉదయం 4 గంటలకు గణపతి హోమం ,5.30 నిమిషాల కు క్షీరాభిషే కం, పుష్పాభి షేకం ,అలంకరణ, అర్చన,8.30 నిమిషాలకు సత్యనారాయణ స్వామి వ్రతాలు, 9 గంటలకు సామూహిక అర్చనలు 11.30 నుండి అన్నదానం ప్రారంభమై,12.30 హారతి ఉంటుందన్నారు.ఈ సారి ప్రత్యేకంగా వరుణ యాగం కూడా నిర్వహించనున్నారని వారు తెలిపారు.సాయంత్రం పల్లకి సేవ సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రధాన విధుల గుండా కొనసాగుతుందని తెలిపారు.ఈ యొక్క వేడుకలలో ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు చంద్రమౌళి,మనోజ్ లతో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## గ్రామ కంఠం నివాసితులకు రెవెన్యూ ఇబ్బందులు తొలగించాలి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్



**ఆదాబ్ సైబరాబాద్, మల్కాజిగిరి:** మల్కాజిగిరి కార్పొరేషన్ కీసర సర్కిల్ పరిధిలోని చంద్రపురి కాలనీ, జవహర్‌నగర్ డివిజన్‌లలో గ్రామ కంఠం భూముల్లో దశాబ్దాలుగా నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న కుటుంబాలకు రెవెన్యూ పరమైన ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.గ్రామ కంఠం ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలు అధికార పరమైన సమస్యలతో ఇబ్బందులు పడకుండా, వారి సమస్యలను సానుకూలంగా పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. ప్రజల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, ఎలాంటి అన్యాయం జరిగినా ప్రజల తరఫున పోరాడుతామని వజ్రేష్ యాదవ్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ గొడుగు వేణు ముదిరాజ్, చంద్రపురి కాలనీ డివిజన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, జవహర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు శాంతి కోటేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ం

## చలాన్ల పేరుతో ప్రజలను వేధించొద్దు కుషాయిగూడ బస్‌స్టాప్ వద్ద ట్రాఫిక్ పోలీసుల తీరుపై ఆగ్రహం



**ఆదాబ్ సైబరాబాద్, కుషాయిగూడ:** కుషాయిగూడ బస్‌స్టాప్ పరిసరాల్లో నో పార్కింగ్ పేరుతో ట్రాఫిక్ పోలీసులు అడ్డగోలుగా చలాన్లు విధిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని స్థానికులు ఆరోపించారు. షాపుల షెడ్ల కింద నిలిపిన ద్విచక్ర వాహనాలను రోడ్డుపైకి తీసుకొచ్చి ఫోటోలు తీసి చలాన్లు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ అంశంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్ డిమాండ్ చేశారు. ప్రజలకు సేవ చేయాల్సిన పోలీసులు వేధింపులకు పాల్పడకుండా న్యాయమైన పార్కింగ్ నిబంధనలు అమలు చేయాలని కోరారు.

## షాద్‌నగర్‌లో రోడ్డు విస్తరణకు ఆరంభం
# చౌరస్తాలో కూల్చివేతలు



**ఆదాబ్ సైబరాబాద్, షాద్ నగర్ :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. షాద్‌నగర్ ప్రధాన చౌరస్తా విస్తరణ పనుల్లో భాగంగా మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ పట్టణ సీఐ సీతారాంతో పాటు పలువురు ఎస్ఐలు, భారీగా పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్, పోలీసు, ఇతర శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో చౌరస్తా వద్దకు చేరుకున్నారు. రోడ్డు విస్తరణకు సహకరిస్తూ కొందరు వ్యాపారులు, స్థానికులు స్వచ్ఛందంగా తమ ఆక్రవణలను.తొలగించుకుంటుండగా, మరికొన్ని ప్రాంతాల్లో అధికారులు బలవంతంగా ఆక్రవణలను తొలగిస్తున్నారు. ప్రస్తుతం చౌరస్తా పరిసరాల్లో కూల్చివేతల ప్రక్రియ నిర్భటంకంగా కొనసాగుతోంది.

# ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటరు సర్వేను
## పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు



**ఆదాబ్ సైబరాబాద్, మేడ్చల్:** ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటరు జాబితా సర్వే కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ నియోజకవర్గంలోని కీసర, దమ్మాయిగూడ, జవహర్‌నగర్, నాగారం డివిజన్‌లలో నిర్వహిస్తున్న సర్వేను బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. సంబంధిత బీఎల్ఓలతో కలిసి సర్వే తీరును సమీక్షిస్తూ, ఓటర్ల వివరాల నమోదులో పారదర్శకత పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ బీఎల్ఏలు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజల ఓటు హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ప్రత్యేక సర్వే నిర్వహించాలని వారు పేర్కొన్నారు.

## దీన్‌దయాళ్ నగర్ సమస్యలు పరిష్కరించాలి
## ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసిన కాలనీవాసులు



**ఆదాబ్ సైబరాబాద్ , మల్కాజిగిరి:** మల్కాజిగిరి నియోజకవర్గంలోని వినాయక్‌నగర్ డివిజన్ దీన్‌దయాళ్ నగర్ రోడ్ నెం.2 కాలనీవాసులు స్థానిక సమస్యలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులను సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తులసి సురేష్, సాయి సాగర్, రాజగోపాల్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# కొండకల్--జెఎన్ టి యు కి కొత్త ఏసీ బస్సు సేవ ప్రారంభం



**ఆదాబ్ సైబరాబాద్, శంకర్‌పల్లి :** మండలంలోని సరిగూడ గ్రామ సమీపంలో ఉన్న మై ఫెయిర్ నుంచి కొండకల్, మై హోమ్,నల్లగండ్ల, రాయదుర్గం మీదుగా జె ఎన్ టి యు వరకు కొత్త ఏసీ బస్సు సేవను ప్రారంభించారు. ఈ కొత్త బస్సు సేవతో ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులకు నగరానికి రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయి.ఈ బస్సు ప్రతిరోజూ ఉదయం 7:45 గంటలకు మై ఫెయిర్ నుంచి బయలుదేరి, ఉదయం 8:00 గంటలకు కొండకల్ చేరుకుని అక్కడి నుంచిమై హోమ్,నల్లగండ్ల, రాయదుర్గం,మీదుగా జె ఎన్ టి యు వెళుతుంది.తిరుగు ప్రయాణంలో సాయంత్రం 4:20 గంటలకు జె ఎన్ టి యు నుంచి అదే మార్గంలో బయలుదేరి రాత్రి 7:00 గంటలకు మై ఫెయిర్‌కు చేరుకుంటుంది.ఈ కొత్త ఏసీ బస్సు సేవ ప్రారంభం కావడంతో కొండకల్ పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌కు నిత్యం ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులకు ఈ సర్వీస్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు.

## నూతన కమిటీల నిర్మాణానికి నాయకత్వం కృషి చేయాలి: తిప్పారపు లక్ష్మణ్ మాదిగ







**ఆదాబ్ సైబరాబాద్, ఆల్వాల్:** కులవివక్ష, సామాజిక అసమానతలు లేని సమసమాజ నిర్మాణానికి గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నూతన కమిటీలను ఏర్పాటు చేసి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ పిలుపునిచ్చారు. ఆల్వాల్ మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల అత్యవసర జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధన ఉద్యమం ఐక్యత, సంకల్పబలం, నిరంతర పోరాట ఫలితమేనని పేర్కొన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో అన్ని విభాగాలకు నూతన కమిటీలను త్వరగా పూర్తి చేయాలని నాయకులకు సూచించారు. ఉద్యమంలో అన్ని వర్గాలను భాగస్వామ్యం చేసి పేద, బలహీన వర్గాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంఎస్పీ జాతీయ నాయకులు కేశపాగ రాంచందర్ మాదిగ, ఎన్.వై. అశోక్ మాదిగ, పంగ ప్రణయ్ మాదిగ, బచ్చలికూర స్వామి మాదిగ, బంగారిగాళ్ల శంకర్ మాదిగతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల కోసం తెలంగాణ నుంచి ఢిల్లీలో

- గళమెత్తిన టీ.డబ్ల్యూ.జే.ఎఫ్.
- జంతర్ మంతర్ ధర్నాకు జాతీయ మీడియా విస్తృత కవరేజ్.
- దేశవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలపై తెలంగాణ ముందుకు రావడం అభినందనీయం. జాతీయ మీడియా ప్రతినిధులు




**ఆదాబ్ సైబరాబాద్,ఖమ్మం/న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపకులు అధ్యక్షులు మామిడి సోమయ్య ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాకు విశేష స్పందన లభించింది. ఈ నిరసన కార్యక్రమాన్ని పలు జాతీయ మీడియా సంస్థలు విస్తృతంగా కవర్ చేయడం విశేషం. తెలంగాణ నుంచి జర్నలిస్టుల హక్కుల కోసం జాతీయ రాజధానిలో పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహించడం అభినందనీయమని పలువురు జాతీయ మీడియా ప్రతినిధులు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పాత్రికేయుల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ముందుండి పోరాటం చేయడం గొప్ప విషయమని వారు అభిప్రాయపడ్డారు. ధర్నా కార్యక్రమంలో జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక డిమాండ్ల 2019లో కరోనా సమయంలో జర్నలిస్టులకు రైల్వే పాసు రాయితీ సదుపాయాన్ని ఉపసంహరించడం జరిగింది.
మరియు జాతీయస్థాయిలో మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి పార్లమెంట్లో బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో జర్నలిస్టులకు సంబంధించి ప్రత్యేక బడ్జెట్ ను కేటాయించాలని, దాని ద్వారా అర్హులైన ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు ఉచిత హెల్త్ కార్డ్స్ ఇళ్ల స్థలాలు పిల్లలకు విద్య వైద్యం ఉచితంగా అందించాలని, వారు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జర్నలిస్టులు కూడా టీడబ్ల్యూజేఎఫ్ చేపట్టిన ఈ ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి పాత్రికేయుని హక్కుల కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. జాతీయ మీడియా విస్తృత కవరేజ్ తో ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారడం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కు దక్కిన గుర్తింపుగా పలువురు జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్,
కోశాధికారి వేములకొండ రమేష్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ ఎలుగోటి వెంకట్, జిల్లా సభ్యులు, మామిడాల కిరణ్, కప్పల మధు,గుజ్జ గోపాలకృష్ణ,
వెలిశెట్టి రామకృష్ణ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల విశ్వాసమే పోలీసుల అసలైన బలం : పరిగి పోలీస్ స్టేషన్ తనిఖీలో ఐజీపీ షహనవాజ్ ఖాసిం

- వార్షిక తనిఖీలో పోలీసుల పనితీరు, క్రమశిక్షణ, రికార్డుల నిర్వహణపై సమగ్ర సమీక్ష
- సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలన, పెండింగ్ కేసుల పరిష్కారంపై కీలక ఆదేశాలు
- 'వికారాబాద్ రక్షణ నేత్రం' సీసీటీవీ వ్యవస్థను ప్రశంసించిన ఐజీపీ.. కమ్యూనిటీ పోలీసింగ్ బలోపేతానికి పిలుపు
- పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించిన ఐజీపీ



**ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్ జిల్లా :** వార్షిక తనిఖీలలో భాగంగా మల్టీ జోన్ గౌరవ ఐజీపీ షహనవాజ్ ఖాసీం సోమవారం పరిగి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శ్రీమతి స్నేహ మెహ్రా ఐజీపీ కి బొకే అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించిన ఐజీపీ పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి తనిఖీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తనిఖీలో భాగంగా పోలీస్ అధికారులు, సిబ్బంది టర్న్‌అవుట్, క్రమశిక్షణ, విధి నిర్వహణ తీరు, ప్రజల పట్ల వ్యవహరించే విధానం, కార్యాచరణ సామర్థ్యాన్ని సమగ్రంగా పరిశీలించారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడి వారు నిర్వహిస్తున్న విధులు, ప్రజలకు అందిస్తున్న సేవలు, సాధించిన విజయాలు, ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తూ, ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా సేవలు అందించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన ఐజీపీ, "వికారాబాద్ రక్షణ నేత్రం" కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పనితీరు, ప్రత్యక్ష పర్యవేక్షణ వ్యవస్థ, నేరాల నియంత్రణలో వాటి వినియోగాన్ని పరిశీలించి పోలీసుల పనితీరును ప్రశంసించారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసు ఫైళ్లు, స్టేషన్ డైరీలు, వివిధ రిజిస్టర్లు, మాల్ఖానా నిర్వహణ, రిసెప్షన్, లాకప్, కంప్యూటర్ విభాగం, మహిళా సహాయ కేంద్రం, సీసీటీఎన్ఎస్ నిర్వహణ, డిజిటల్ రికార్డుల నిర్వహణ తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. కేసుల దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచాలని, పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించాలని, ప్రతి కేసులో నాణ్యమైన సాక్ష్యాధారాల సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, రికార్డుల నిర్వహణలో నిర్దేశిత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి ఐజీపీ మాట్లాడుతూ, "ప్రతి పోలీస్ అధికారి తనలో ఉన్న సామర్థ్యాన్ని గుర్తించి నిరంతరం అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలి. సరైన అలవాట్లు, క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం, సేవా దృక్పథం ప్రతి పోలీస్‌కు అత్యంత అవసరం. ప్రజలకు న్యాయం చేయడం, వారి విశ్వాసాన్ని నిలబెట్టడం ప్రతి పోలీస్ బాధ్యత" అని అన్నారు. అదేవిధంగా సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, ఎన్డిపిఎస్ చట్టం కింద మాదకద్రవ్యాల నిర్మూలనకు మరింత కఠిన చర్యలు కొనసాగించాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని, ప్రమాదం జరిగిన వెంటనే స్పందిస్తూ గోల్డెన్ అవర్ సమయంలో బాధితులకు తక్షణ వైద్య సహాయం అందేలా పోలీస్ అధికారులు వేగంగా స్పందించాలని, ప్రతి ప్రాణం విలువైనదనే భావనతో పనిచేయాలని సూచించారు. ప్రజలతో మరింత స్నేహపూర్వకంగా మెలుగుతూ కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని, గ్రామస్థాయిలో ప్రజలతో సమన్వయాన్ని పెంపొందించాలని, మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, శాంతిభద్రతల పరిరక్షణలో సాంకేతిక పరిజ్ఞానం, నిఘా వ్యవస్థలు, సీసీటీవీ నెట్‌వర్క్‌ను సమర్థవంతంగా వినియోగించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం పరిగి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఐజీపీ మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి పోలీస్ అధికారి విధి నిర్వహణతో పాటు పర్యావరణ పరిరక్షణలోనూ తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా పరిగి డీఎస్పీ శ్రీనివాస్, పరిగి సీఐ కొండల్ రెడ్డి, పరిగి ఎస్ఐ మోహన కృష్ణ , ఇతర పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 2009 వరదల గుణపాఠం మరువొద్దు..!

- కొత్త రాజోలిలోనే ఎంఆర్ఓ కార్యాలయంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలి
- 11 గ్రామాల ప్రజల భవిష్యత్తు, ప్రభుత్వ రికార్డుల భద్రత కోసం ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలి
- తెలంగాణ రాజ్యాధికార పార్టీ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు మొరుగు వీరేష్ డిమాండ్





**ఆదాబ్ సైబరాబాద్, గద్వాల :** 2009లో తుంగభద్ర--కృష్ణా నదుల వరదలు పాత రాజోలి గ్రామాన్ని పూర్తిగా ముంపునకు గురిచేసిన విషాదాన్ని ప్రభుత్వం మరవకూడదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు మొరుగు వీరేష్ అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రూ.2.25 కోట్లతో నిర్మించనున్న ఎంఆర్ఓ కార్యాలయంతో పాటు భవిష్యత్తులో నిర్మించే అన్ని ప్రభుత్వ కార్యాలయాలను వరద ముప్పు లేని కొత్త రాజోలి గ్రామంలోనే ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.2009 అక్టోబర్ 2 నుంచి 5 వరకు కురిసిన భారీ వర్షాలతో తుంగభద్ర నది ఉద్ధృతంగా ప్రవహించి, ఆనకట్టల నుంచి భారీగా నీటిని విడుదల చేయడంతో కృష్ణా--తుంగభద్ర సంగమ ప్రాంతాలు జలమయమయ్యాయని ఆయన గుర్తు చేశారు. అప్పటి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని ఆలంపూర్ ప్రాంతంతో పాటు పాత రాజోలి గ్రామం పూర్తిగా వరద ముంపునకు గురై వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయని, వేల ఎకరాల పంటలు, ఇళ్లు, ప్రభుత్వ భవనాలు, రహదారులు, విలువైన ప్రభుత్వ రికార్డులు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు.
వరదల అనంతరం ప్రభుత్వం ముంపు ప్రమాదం లేని ఎత్తైన ప్రాంతంలో కొత్త రాజోలిని ఏర్పాటు చేసి సుమారు 3,700 కుటుంబాలకు పునరావాసం కల్పించిందని, పాఠశాలలు, ఆసుపత్రి, ఇతర ప్రభుత్వ అవసరాల కోసం 10 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని కేటాయించిందని తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఆ నిర్ణయానికి అనుగుణంగానే ప్రభుత్వ కార్యాలయాలన్నీ కూడా కొత్త రాజోలిలోనే ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.ఇటీవల కొత్త రాజోలి అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎంఆర్ఓ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేసి, ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2.25 కోట్లతో నిర్మించనున్న ఎంఆర్ఓ కార్యాలయాన్ని కొత్త రాజోలిలోని 2 ఎకరాల ప్రభుత్వ భూమిలోనే నిర్మించాలని కోరిన విషయాన్ని మొరుగు వీరేష్ ప్రస్తావించారు. ప్రజల డిమాండ్ పూర్తిగా సమంజసమైనదేనని ఆయన అభిప్రాయపడ్డారు.
కొత్త రాజోలిలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేస్తే వరద ముప్పు నుంచి శాశ్వత రక్షణ లభిస్తుందని, రెవెన్యూ, గ్రామపంచాయతీ, విద్య తదితర కీలక ప్రభుత్వ రికార్డులు భద్రంగా ఉంటాయని, మండలంలోని 11 గ్రామాల ప్రజలకు ఒకే కేంద్రంలో ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. విశాలమైన ప్రభుత్వ భూమి, పార్కింగ్, భవిష్యత్తు విస్తరణకు అనుకూలమైన స్థలం ఉండటంతో పాటు ప్రజలకు



రాకపోకలు సులభమవుతాయని పేర్కొన్నారు.
ప్రజల వినతిపత్రాన్ని స్వీకరించి సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఎంఆర్ఓ రామ్మోహన్ హామీ ఇవ్వడం స్వాగతించదగ్గ విషయమని మొరుగు వీరేష్ అన్నారు. 11 గ్రామాల ప్రజల భవిష్యత్తు, ప్రభుత్వ ఆస్తులు, కీలక రికార్డుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆలస్యం చేయకుండా ఎంఆర్ఓ కార్యాలయంతో పాటు భవిష్యత్తులో నిర్మించే అన్ని ప్రభుత్వ కార్యాలయాలను కొత్త రాజోలి గ్రామంలోనే ఏర్పాటు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరఫున ఆయన మరోసారి గట్టిగా డిమాండ్ చేశారు.


EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL- MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com

